సాక్షి ప్రకాశం

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



వెలిగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

వెలిగొండ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. - 8లో..



అంతర్ జిల్లా దొంగ అరెస్టు

వివిధ చోరీ కేసుల్లో నిందితునిగా ఉన్న అంతర్ జిల్లా దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు టంగుటూరు ఎస్సై తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 31/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

టెక్నికల్ కోర్సు విద్యార్థుల మార్కుల జాబితా విడుదల

ఒంగోలు సిటీ: ఏప్రిల్–2024 లో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన టైలరింగ్, డ్రాయింగ్‌లకు సంబంధించిన లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితాలు ఒంగోలులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం పరీక్షల విభాగానికి వచ్చినట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్ మార్కుల జాబితాను తీసుకొనే విద్యార్థులు తప్పనిసరిగా విద్యార్థితో పాటు పరీక్షకు హాజరైన హాల్‌టికెట్ జిరాక్సు కాపీ గానీ లేదా నెట్‌లో తీసుకున్న పాస్ అయిన మార్కుల జాబితా జిరాక్సు కాపీని కానీ తప్పనిసరిగా తీసుకొని రావాల్సిందిగా డీఈఓ కోరారు.

ఒంగోలు ఐటీఐ కళాశాలలో బ్రిడ్జి కోర్సు

ఒంగోలు సిటీ: ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సులు పాసైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకుగాను ఒంగోలు ప్రభుత్వ ఐటీఐ (బాలురు) కళాశాలలో బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నట్లు ప్రధానాచార్యుడు ఎం.వి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు ఎం.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ బ్రిడ్జి కోర్సు ఫిబ్రవరి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐటీఐ రెండు సంవత్సరాల కోర్సులు ఉత్తీర్ణులైనవారు 3 సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులో నేరుగా 2 సంవత్సరాల్లోకి అడ్మిషన్ పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను, ఒంగోలు ప్రభుత్వ ఐటీఐ (బాలురు) కళాశాలలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు పనివేళలలో సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 99894 33298 నంబరును సంప్రదించాలని కోరారు.

3న రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

రాచర్ల: మండలంలోని గౌతవరంలో పోలేరమ్మ అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 3వ తేదీ సోమవారం ఉదయం 7 గంటలకు రాష్ట్ర స్థాయి ఆరు పండ్ల విభాగం ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్ల పోటీల్లో పాల్గొనదలచిన వారు 3వ తేదీ సోమవారం 7 గంటల లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ ఎడ్ల పోటీల్లో విజేతలకు మొదటి నుంచి ఐదు బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను బహూకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 98451 18409, 99168 04870 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గుండ్లకమ్మ జలాశయంలో చేప పిల్లలు విడుదల రేపు

మద్దిపాడు: మండల పరిధిలోని గుండ్లకమ్మ జలాశయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 18,40,000 చేప పిల్లలు విడుదల కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ హాజరవుతారన్నారు.

8, 9న జాతీయ నాస్తిక మేళా

- ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు

ఒంగోలు సిటీ: గుంటూరు జిల్లా నిడమర్రులో ఈనెల 8, 9వ తేదీల్లో జరిగే జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు అన్నారు. ఒంగోలులోని మంచిపుస్తకం షాపు వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ నాస్తిక మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు మాట్లాడుతూ నాస్తిక మేళ రూపశిల్పి రామకృష్ణ 32 సంవత్సరాల క్రితం సాంఘిక, ఆర్థిక, రాజకీయ పోరాటాలు బొమ్మ బొరుసు లాంటివని, అన్ని రంగాల్లో ప్రత్యామ్నాయాన్ని చూపించాలన్నారు. నాస్తిక ఉద్యమం అంటే కేవలం దైవభావాన్ని తిరస్కరించడమే కాదని ఒక శాస్త్రీయమైన ఆలోచనన్నారు. నిడమర్రులో జరిగే 33వ జాతీయ నాస్తిక మేళాలో ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని, వివిధ అంశాలపై చర్చలు, విజ్ఞాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, రిటైర్డు జాయింట్ కలెక్టర్ పేరయ్య, ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, రైతు కూలీ సంఘం జిల్లా అధ్య క్షుడు కొంగర నరసింహం, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, జిల్లా కార్యదర్శి బీమవరపు సుబ్బారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఎం.జార్జి, ఏఎల్ ప్రసాద్, ఎస్వీ రంగారెడ్డి, లింగ వెంకటేశ్వర్లు, డొల్ల అప్పారావు, న్యాయవాది జగదీష్, సుదర్శన్, డొడ్ల శ్రీను, చావలి చైతన్య, ఆవుల సుబ్రహ్మణ్యం, వి.శివరావు పాల్గొన్నారు.



భూ వడ్డ్రీ..!

నేటి నుంచి భారీగా రిజిస్ట్రేషన్ చార్జీల వడ్డన

ప్రజలకు భారం కానున్న సొంతింటి కల

కరెంటు బిల్లులే కాదు..భారీగా పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలు ప్రజలకు షాక్ ఇస్తున్నాయి. రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మోతమోగిస్తోంది. మార్కెట్ విలువలను ఒకటి, రెండు శాతం కాదు ఏకంగా 15 నుంచి 20 శాతం వరకు పెరగనున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి వారికి సొంతింటి కల మరింత భారంగా మారనుంది. సెంటో, రెండు సెంట్లో కొనుక్కొని రిజిస్ట్రేషన్ చేయించుకుందామనుకున్న ఆశలు అడియాసలుగా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత కుదేలు కానుంది. శనివారం నుంచి అమలులోకి రానున్న కొత్త చార్జీలతో జిల్లా వాసులపై సుమారు రూ.60 కోట్ల మేర అదనపు భారం పడనుంది.



ఒంగోలులో రిజిస్ట్రేషన్ కోసం వచ్చి బిడ్డతో సహా వేచి ఉన్న మహిళ

- పెరిగిన చార్జీల ప్రకారం జిల్లా ప్రజలపై రూ.60 కోట్ల అదనపు భారం
- రెండు రోజులపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట
- 30వ తేదీ 682, 31వ తేదీ 1000కి పైగా రిజిస్ట్రేషన్లు
- కూటమి ప్రభుత్వం కొలువు తీరాక పడిపోయిన రియల్ వ్యాపారం
- పెరిగిన చార్జీలతో కుదేలవుతుందని వ్యాపారుల ఆందోళన

ఒంగోలు సబర్బన్:

భూ బాదుడుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా స్థిరాస్తి విలువలు పెంచుకుంటూ పోయింది. అందుకుగాను ఫిబ్రవరి ఒకటో తేదీని ముహూర్తంగా నిర్ణయించి రిజిస్ట్రేషన్లు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ చైర్మన్‌గా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్, ఆ శాఖ డీఐజీ, సబ్ రిజిస్ట్రార్లు, తహశీల్దార్లు కమిటీగా ఏర్పడి భూ బాదుడుకు పూనుకున్నారు. సవరించిన ధరలను ఇప్పటికే కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌ల శాఖ ద్వారా జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.300 కోట్లు ఆదాయమే లక్ష్యంగా అధికారులు టార్గెట్లు పెట్టుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా రూ.240 కోట్ల ఆదాయం లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లా వ్యాప్తంగా 5 నుంచి 16 శాతం వరకు పెంచామని అధికారులు చెబుతున్నా ఒక్కో ప్రాంతంలో 30 నుంచి 40 శాతం కూడా పెంచిన ప్రాంతాలు ఉన్నాయి. అధికారులు తక్కువ పెంచిన మార్కెట్ ధరలను మాత్రమే బయట పెడుతూ ఎక్కువగా ఉన్నవాటిని బట్టబయలు చేయకుండా గోప్యంగా ఉంచుతున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. అంటే సరాసరిన లెక్కలేస్తే ఒక్క ఏడాదిలో దాదాపు ప్రజలపై రూ.60 కోట్ల వరకు అదనపు భారం పడుతున్నట్లు పెరిగిన మార్కెట్ విలువను బట్టి చూస్తే అర్థమవుతోంది.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రియల్ ఎస్టేట్ కుదేలు...

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రియల్ ఎస్టేట్ కుదేలైంది. జిల్లాకు ఒక్క పరిశ్రమ కానీ, ఒక్క కేంద్ర, రాష్ట్రాలకు చెందిన విద్యా సంస్థలు కానీ రాలేదు. దానికి తోడు ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి వరుణుడు ముఖం చాటేశాడు. దాంతో వర్షాలు పడక పంటలు పూర్తిగా లేకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరమే కరువు మండలాలను ప్రకటించే స్థితికి చేరుకుంది. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక, మరోపక్క వర్షాలు లేక పంటలు పండక రైతు లోగిళ్లు వెలవెలబోతున్నాయి. దాంతో రైతుల్లో కూడా క్రయ, విక్రయాల సామర్థ్యం పూర్తిగా క్షీణించి పోయింది. ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. తాజాగా చార్జీలు భారీగా పెరగడంతో ఇబ్బందులు తప్పవని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు.

ఒంగోలు నగరంలో పెరిగిన ప్రాంతాల వారీగా కొన్ని...

ఏరియా	చదరపు గజం రూ॥లలో	
	పాత రేటు	కొత్త రేటు
పెళ్లూరు పోస్టల్ కాలనీ	5400	6000
ముక్తినూతలపాడు	5400	5800
కొప్పోలు	7000	7500
అన్నవరప్పాడు	9000	9500
తూర్పు క్రిస్టియన్ పాలెం	19,000	20,000
కన్యకాపరమేశ్వరి వీధి	34,000	35,000
లాయర్‌పేట	29,000	30,000

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా పెరిగిన శాతం...

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	పెరిగిన శాతం
సింగరాయకొండ	15.78
కనిగిరి	11.88
అమ్మనబ్రోలు	11.77
చీమకుర్తి	7.58
కంభం	5.33
దర్శి	11.64
గిద్దలూరు	6.28
మార్కాపురం	6.50
ఒంగోలు	8.00
పొదిలి	12.84
సంతనూతలపాడు	3.69
యర్రగొండపాలెం	9.28



సరాసరిన 9.21 శాతం పెరుగుదల

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల మార్కెట్ విలువలను స్వల్పంగా పెంచాం. జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ చైర్మన్‌గా కమిటీ జిల్లా వ్యాప్తంగా మార్కెట్ విలువలను అధ్యయనం చేసింది. దాంతో జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సరాసరిన 9.21 శాతం మార్కెట్ విలువలను పెంచాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా మార్కెట్ విలువను పెంచుతామని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ప్రకటిస్తే జిల్లా వ్యాప్తంగా మొత్తం 35 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి కమిటీ దరఖాస్తుదారుల అభిప్రాయం మేరకు నిర్ణయాలు తీసుకుంది.

– ఆళ్ళ బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్, ప్రకాశం



ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జనం రద్దీ

రెండు రోజులుగా కార్యాలయాలు కిటకిట

ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి భూముల మార్కెట్ విలువలు పెరుగుతాయని ప్రభుత్వం ప్రకటించటంతో రెండు రోజులుగా జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. సాధారణంగా రోజులకు సరాసరి 250 నుంచి 350 వరకు స్థిరాస్తి డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యేవి. అలాంటిది జనవరి 30వ తేదీ ఒక్కరోజులోనే 682 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి. సర్వర్లు మొండికేయకుండా సజావుగా సాగి ఉంటే 1000కు పైగా రిజిస్టర్ పూర్తయ్యేవి. శుక్రవారం చివరి రోజు కావడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు. దాంతో చివరి రోజు 1000 మార్కు రిజిస్ట్రేషన్లు దాటవచ్చని అధికారులు అంచనాలు వేస్తున్నారు. జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ జనం బారులు తీరారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు ఇప్పటికిప్పుడు స్థిరాస్తిని కొనుగోలు చేసుకున్న వారు కాదు. గతంలో కొనుగోలు చేసుకొని అగ్రిమెంట్ల మీద ఉన్నవారు మార్కెట్ విలువలు పెరిగితే భారం పెరుగుతుందని భావించి ఇప్పుడు వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

ఫీజు పోరును విజయవంతం చేయండి

- సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మద్దిపాడులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఫీజు పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలను నిలిపేశారన్నారు. వాటిని ఇవ్వలేనని బహిరంగంగా సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఏ ఒక్క తల్లి, తండ్రి పిల్లలను చదివించలేమని బాధపడకుండా పరిపాలన చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలను క్రమం తప్పకుండా అమలు చేశారన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అంటూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను, విద్యార్థులను మోసం చేశారని మండిపడ్డారు. నాలుగు త్రైమాసికాలుగా బకాయిలు పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.3900 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయన్నారు. కాలేజీ నుంచి పంపించేస్తున్నాయని, తక్షణమే ఈ పరిస్థితిని నివారించాలన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసి పనులకు వెళ్లే దుస్థితి వచ్చిందని, ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజులివ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నందుకు నిరసనగా ఈ నెల 5వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు అన్ని వర్గాల ప్రజలతో పాటు విద్యార్థి విభాగాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న 'ఫీజు పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి వాకా కోటిరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండల బాలచంద్రమౌళి, గుడ్డపాకల రవి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, ఎంపీటీసీ సభ్యులు పయనం ప్రభాకర్, బొమ్మల దేవదాసు, సర్పంచ్‌లు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, బొమ్మల రామాంజనేయులు, పార్టీ నాయకులు నాదెండ్ల మహేష్, అన్వేష్, సురేష్, అశోక్ రెడ్డి, సంధ్య, రజిని, మస్తానమ్మ, జయమ్మ తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

- ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలి

ఒంగోలు సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బడ్జెట్‌లోనైనా విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.అశోక్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సాగర్ సెంటరులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం మరింత ప్రమాదకరమైనదన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో తగ్గించి, ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేస్తోందన్నారు. యూజీసీ స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకువచ్చిన 84,83,85 జీవోలను రద్దు చేయకుండా, విద్యా ప్రైవేటీకరణ ను ప్రోత్సహిస్తోందన్నారు. ఐఫియా కౌన్సిల్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలన్నింటిలో మాతృభాష మాధ్యమాన్ని అమలు చేయాలని, నిర్బంధ ఉచిత విద్యా హక్కును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు అమ్మయ్య, పి.ఆంజనేయులు, పీపీ రంగారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు విజయ్, నాగలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల నాయకులు

బాలికల ఉన్నత భవిష్యత్తు అందరి బాధ్యత




బంగారుబాల్యం అవగాహన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- బాల్య వివాహాల నివారణకు చేయి చేయి కలుపుదాం
- బంగారు బాల్యం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా


ఒంగోలు అర్బన్: బాలికల ఉన్నత భవిష్యత్తు మనందరి బాధ్యత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ఆ దిశగా జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. బాలల హక్కులు చట్టాలపై శుక్రవారం గ్రీవెన్స్ హాలులో ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లకు డివిజన్ స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించి బాలికల సాధికారత దిశగా ఎదిగేలా బంగారు బాల్యం కార్యక్రమం రూపకల్పం చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలన, పోషకాహార లోపం స్థాయి నుంచి బాలల బంగారు భవిష్యత్తుకు ప్రథమ స్థానంలో జిల్లా ఉండేలా మార్పు తీసుకురావడం అవసరమన్నారు. జిల్లాలో ప్రతి స్కూల్‌లో ఒక టీచర్‌ను నోడల్ అధికారిగా నియమించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. బాల్య వివాహాల పట్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. పారిశ్రామికీకరణలో భాగంగా జిల్లాలో లభించే ఉపాధి అవకాశాలను సమర్థంగా అందిపుచ్చుకునే స్థాయికి మానవ వనరులను బాలికలను కూడా సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతి మహిళా పోలీసు వారి పరిధిలో ఉన్న బాలికల వివరాలతో ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా తమవంతు బాధ్యత వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, డీసీపీఓ దినేష్‌కుమార్, ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, డీఎల్‌డీఓ మహాలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, సార్డ్స్ ప్రతినిధి సునీల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాయంతోనే ఊపిరి నిలిచేది!

- ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడు
- వైద్యానికి సుమారు రూ.15 లక్షలు అవసరం
- దాతల సాయం కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు



లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పల్లె శివరాం



తల్లిదండ్రులు వీర బ్రహ్మయ్య, మల్లేశ్వరితో శివరాం

కొండపి: ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో ఆ చిన్నారికి పెద్ద కష్టం వచ్చిపడింది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతూ ఆక్సిజన్ మిషన్ లేకుండా పట్టుమని పది నిమిషాలు కూడా శ్వాస తీసుకోలేని దుస్థితిలో ఉన్నాడు. గాలిలో దీపంలా కొట్టుమిట్టాడుతున్న బిడ్డ ప్రాణాలను నిలుపుకునే స్తోమత లేక కూలి చేసుకునే ఆ తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కొండపి మండలం గుర్రప్పడియ గ్రామానికి చెందిన పల్లె వీర బ్రహ్మయ్య, మల్లేశ్వరిలకు ముగ్గురు సంతానం. బేల్దారి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మొదటి కుమారుడు ఓంకార్ 9వ తరగతి, రెండో కుమారుడు శివరాం 8వ తరగతి, మూడో కుమార్తె వీర జ్ఞానేశ్వరి ఏడో తరగతి చదువుతున్నారు. వీరు ప్రతిరోజూ గుర్రప్పడియ గ్రామం నుంచి సంతనూతలపాడు మండలం మద్దులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తూ విద్యనభ్యసిస్తున్నారు. ఉన్నంతలో సంతోషంగా సాగిపోతున్న వీరి కుటుంబంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలముకున్నాయి. దసరా సెలవుల నుంచి రెండో కుమారుడు పల్లె శివరాం (13) అనారోగ్యంతో స్కూల్‌కి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఎక్కువ ఆయాస పడుతూ ఇబ్బంది పడుతున్న తరుణంలో ఒంగోలు లోని వివిధ హాస్పిటళ్లలో చికిత్స చేయించారు. కొంతమేర నయం అయినా శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడు. శివరాం తల్లిదండ్రులు గ్రామస్తుల సూచనలతో మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్లో చూపించగా అక్కడ నిర్వహించిన పరీక్షల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్‌గా తేలింది. దీంతో ఒక్కసారిగా తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. ఇంత చిన్న వయసులో దేవుడు ఎంత పెద్ద కష్టం ఇచ్చాడని విలపిస్తున్నారు. బాలుడి తండ్రి వీర బ్రహ్మయ్య 'సాక్షి'తో మాట్లాడుతూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమ కుమారుడికి ఖరీదైన వైద్యం చేయించే స్తోమత లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ కోసం హైదరాబాద్‌లోని క్యాన్సర్ హాస్పిటల్‌లో చేర్పామని చెప్పాడు. కీమోథెరపీ, ఇతర వైద్యం కోసం డాక్టర్లు రూ.15 లక్షలు అవుతుందని చెప్పారని, ఇప్పటికే వైద్యం కోసం రూ.50 వేలు అడ్వాన్స్ కట్టించుకున్నారని తెలిపాడు. ప్రస్తుతం ఆక్సిజన్ మిషన్ సాయంతోనే శ్వాస పీల్చుకుంటున్నాడని, ఆక్సిజన్ తీసివేస్తే పది నిమిషాలు కూడా ఉండలేకపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. దాతలు ఎవరైనా స్పందించి ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్నాడు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం



కాలిపోతున్న పొగాకు బ్యారన్

సంతనూతలపాడు: క్యూరింగ్‌లో ఉన్న పొగాకు బ్యారన్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న మరో బ్యారన్‌కు మంటలు వ్యాపించడంతో రెండు బ్యారన్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటన సంతనూతలపాడు మండలంలోని ఎం.వేములపాడు గ్రామ పంచాయతీ గొర్లమిట్ట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మద్దినేని సుబ్బారావు, మద్దినేని లక్ష్మీనారాయణకు చెందిన బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అల్లుడు కర్ర జారి పొగ గొట్టంపై పడటంతో మంటలు ఎగసిపడ్డాయి. సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పక్కనే ఉన్న మరో 3 బ్యారన్లకు మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. ఎస్సై వేజండ్ల అజయ్‌బాబాబు పర్యవేక్షించారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి

దొనకొండ: వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరు మృతి చెందిన సంఘటన దొనకొండ మండలంలోని సంగాపురం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. వద్దిపాడు పంచాయతీ కలివెలపల్లి గ్రామానికి చెందిన శ్రీరాం వెంకటయ్య(52) వ్యక్తిగత పని కోసం బైక్‌పై దొనకొండకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో సంగాపురం సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంగాపురానికి చెందిన వారు పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో వెంకటయ్యను గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఓ ఆటోలో దొనకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

వెలిగొండకు రూ.2 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలి



మాట్లాడుతున్న సోమయ్య, హాజరైన నాయకులు

● రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్

మార్కాపురం: ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో శాశ్వతంగా కరువును నివారించే పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మార్కాపురంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఎంపీజే, ఏఐటీయూసీ, సీఐటీయూ తదితర పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. కమిటీ కోఆర్డినేటర్ డీకేఎం రఫీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ.. నిరంతరం కరువు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కల అయిన వెలుగొండ ప్రాజెక్టులో మిగులు పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఆర్థికంగా, రాజకీయంగా పశ్చిమ ప్రకాశం పూర్తిగా వెనుకబడిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. వచ్చే శాసనసభ బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశానికి కృష్ణా జలాలే శరణ్యమని, ఈ విషయమై గత 5 దశాబ్దాల నుంచి వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీపీఎం కార్యదర్శి డి.సోమయ్య మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టు పనులను పూర్తిచేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వాలకు లేకపోవడం శోచనీయమన్నారు. ప్రాజెక్టు నీరు అందుబాటులోకి వస్తే 4.32 లక్షల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జావీద్ అన్వర్ మాట్లాడుతూ ముంపు గ్రామాల్లో 2019 అక్టోబర్‌కు 18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి ప్రభుత్వం అర్హులుగా గుర్తించిందని, అయితే నేటికీ ప్యాకేజీ అందలేదన్నారు. 2025 జనవరి నాటికి 18 ఏళ్లు దాటిన వారిని కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అర్హులుగా గుర్తించాలని కోరారు. ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు పూర్తి చేయడం కోసం మరోమారు పోరాటాలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశిం, సీపీఐ పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, రైతు సంఘం నాయకులు తిరుపతిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కొండయ్య, నాగరాజు, కాశయ్య, నన్నేసా తదితరులు పాల్గొన్నారు.

జీవాల పెంపకందారులకు రూ.10 వేల కోట్లు ఇవ్వాలి

ఒంగోలు సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గంటా శ్రీరామ్, కిలారి పెద్దబ్బాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలులోని ఎల్బీజీ భవన్‌లో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పెంపకందారునికి 50 శాతం సబ్సిడీపై రూ.5 లక్షల చొప్పున రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో మేలు రకం మాంసం ఉత్పత్తిని పెంచాలంటే లక్ష మంది పెంపకందారులకు మేలు రకం విత్తన పొట్టేళ్లు ఇవ్వాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు కండే బాలకృష్ణ, నక్క గంగరాజు, మసనం శివయ్య, కొండరాజు జయరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ నాయకులు

అంతర్ జిల్లా దొంగ అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు

టంగుటూరు: అంతర్ జిల్లా దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో నిందితుడి వివరాలను ఎస్సై వెల్లడించారు. వల్లూరు జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులోని షాపింగ్ కాంప్లెక్సులో జనవరి 23న దొంగలు ఓ దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి నగదు, సరుకు చోరీ చేశారు. కుర్ర అంకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టంగుటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. గుంటూరు రామిరెడ్డితోట 1వ లైనుకు చెందిన షేక్ అన్వర్‌బాషాను నిందితుడిగా గుర్తించారు. వల్లూరులో ఉన్న నిందితుడిని అరెస్టు చేసి రూ.12 వేల నగదు, రూ.10 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గుంటూరులో పది కేసులల్లో ముద్దాయిగా ఉన్నాడని, రెండు మర్డర్ కేసులు, రాబరీ, డెకాయిట్, రాత్రి వేళల్లో మూసి ఉన్న షాపుల షటర్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడిన కేసుల్లో ఉన్నాడని ఎస్సై వివరించారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలి

టంగుటూరు: వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని రవాణా శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల పేర్కొన్నారు. ఎన్‌హెచ్ -16, పీఐయూ ఒంగోలు ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు సింహపురి ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు హెడ్ శివకుమార్ ఆధ్వర్యంలో టంగుటూరు టోల్ ప్లాజా వద్ద 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వాహనదారులను రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, పీఆర్వో నరసింగారావు, సేఫ్టీ మేనేజర్ షేక్ బాషిత్, మేనేజర్లు నాగేశ్వరరావు, సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరులో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి సుశీల

అడవిపందుల దాడిలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

మార్కాపురం: అడవి పందుల దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి మార్కాపురం మండలంలోని గుండంచర్ల, జమ్మనపల్లి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. పెద్దారవీడు మండలం గుండంచర్లకు చెందిన కొండేటి వెంకటేశ్వర్లు తన బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. జమ్మనపల్లి గ్రామం దాటగానే రోడ్డుపై అడవి పందులు ఒక్కసారిగా అడ్డురావడంతో బ్రేక్ వేశారు. సుమారు 8 అడవి పందులు గుంపుగా వచ్చి బైకును తగలడంతోపాటు వెంకటేశ్వర్లుపై దాడి చేయడంతో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు మార్కాపురంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ వంట గది దగ్ధం

టంగుటూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ పాక్షికంగా దగ్ధమైంది. ఈ సంఘటన టంగుటూరు బొమ్మల సెంటర్లోని హిందుస్థాన్ బేకరీలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది కథనం మేరకు.. హిందుస్థాన్ బేకరీ వంట గదిలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే ఫ్రిజ్, మైక్రోఓవేన్, పిజ్జా తయారీ యంత్రం తదితర సామగ్రి దగ్ధమయ్యాయి. రూ.30 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి రమణారెడ్డి చెప్పారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అక్రమ రిజిస్ట్రేషన్‌పై మరో ఫిర్యాదు



డీటీ మల్లికార్జుననాయుడికి ఫిర్యాదు చేస్తున్న ఖాదర్ బాషా

యర్రగొండపాలెం: పట్టణంలో హాట్ టాపిక్‌గా మారిన అక్రమ రిజిస్ట్రేషన్‌పై షేక్ ఖాదర్‌బాషా రెవెన్యూ, పోలీస్ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 58లో తనకున్న భూమిపై నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి మండలంలోని సర్వాయపాలెం గ్రామానికి చెందిన యోగమ్మ రిజిస్టర్ చేసుకున్నారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. 1976లో ఆ స్థలాన్ని చట్టపరంగా తన కుటుంబం రిజిస్ట్రేషన్ చేయించుకుందని, అందులో తాము నివాసం ఉండేందుకు 1977లో ఓ గృహాన్ని నిర్మించుకున్నామని, అయితే మిగిలిన ఖాళీ స్థలాన్ని యోగమ్మ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరారు. యోగమ్మ భర్త డి.శ్రీనివాసరావు సర్వే నంబర్ 58/1లో దాదాపు రూ.3 కోట్ల విలువ చేసే స్థలాన్ని గిఫ్ట్ డీడ్‌తో స్వాహా చేసిన విషయం విదితమే. ఈ కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో మరో ఫిర్యాదు రావడం చర్చనీయాంశంగా మారింది.

వసతి గృహ విద్యార్థులకు మెరుగైన బోధన



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి డీబీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్ సమీపంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఆనంద నిలయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. వసతి గృహంలో మరమ్మతు పనుల పురోగతిపై ఆరా తీశారు. వసతి గృహం పైన మరో రెండు గదులు నిర్మించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఆసక్తి మేరకు మెనూలో మార్పులు చేసి భోజనం అందించాలని, మంచి ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతంలో లాగానే విద్యార్థులకు నైట్ డ్రెస్సులు, టవల్స్ అందిస్తామని చెప్పారు.